క్లుప్తంగా

సేవలతో ప్రభుత్వానికి పేరు తేవాలి

కరప: గ్రామ వలంటీర్లు తమకు కేటాయించిన 50 కుటుంబాల వారితో సత్సంబంధాలు ఏర్పరుచుకుని, ప్రభుత్వ పథకాలు అందేలా చేసి రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావుతో కలసి కొత్తగా ఎంపికైన గ్రామ వలంటీర్లకు నియామక ఉత్తర్వులు అందజేశారు. పాతర్లగడ్డ, నడకుదురు, వలసపాకల గ్రామాలకు ఇద్దరు చొప్పున, గొడ్డటిపాలెం, గొర్రిపూడి గ్రామాలకు ఒక్కొక్కరికి నియామక పత్రాలు అందజేశారు. పాతర్లగడ్డ సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, రాయుడు శ్రీనివాస్, ఎంపీడీఓ కె.అప్పారావు, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సూచీపై శిక్షణ

కరప: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ అభివృద్ధి సూచీపై గ్రామ కార్యదర్శులకు ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలంటే ముందుగా వివిధ శాఖలకు సంబంధించిన డేటా సేకరించాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు అనుసరించాల్సిన విధానాలపై ఆయన కార్యదర్శులకు అవగాహన కల్పించారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలి

కాకినాడ లీగల్: ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అనవసర గొడవలకు వెళ్లడం వలన మీకు, మీ కుటుంబ సభ్యులకు సమాజంలో ఎంతో ఇబ్బంది అని కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ షిరీన్ తెలిపారు. స్థానిక స్పెషల్ సబ్‌జైల్‌ను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేనివారు మండల న్యాయసేవాధికార సంస్థకు దరఖస్తు చేసుకోవచ్చన్నారు. సబ్‌జైలులో ఉన్నప్పుడు వివిధ పుస్తకాలు చదివి మీలో ఉన్న చెడుగుణాలను దూరం చేసుకోవచ్చని సూచించారు. అనేక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కె.నాగజ్యోతి, సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు పాల్గొన్నారు.

అవగాహన లేకనే కాలేయ మరణాలు

బోట్‌క్లబ్: కాలేయ వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం వల్లనే మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని సౌత్ ఇండియన్ లివర్ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ టామ్ చెరియన్ అన్నారు. కాకినాడలోని ఒక హోటల్లో శనివారం కాలేయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సరైన సమయంలో కాలేయ వ్యాధిని గుర్తించి మందులు వాడితే కాలేయ సర్జరీ, మార్పిడి చేయాల్సిన అవసరం కూడా లేదన్నారు. 40 ఏళ్లు దాటిన వారు ఏటా ఒక సారి కాలేయ పరీక్ష చేయించుకోవాలన్నారు. కాలేయ వ్యాధిగ్రస్తుల ప్రాణాలు నిలిపేందుకు సౌత్ ఇండియన్ లివర్ ఇనిస్టిట్యూట్ సేవలు కాకినాడలో త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. తమ సంస్థ ద్వారా లివర్ సర్జరీలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో స్వర్ణకాంత్, రజిత్ శ్రీవాత్సవ్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ శంకరన్‌కు నివాళి

కాకినాడ సిటీ: మాజీ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ 13వ వర్ధంతిని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. దళిత, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు మోర్త రాజశేఖర్, అయితాబత్తుల రామేశ్వరరావు, జి.బేబీరాణి, చెక్కల రాజ్‌కుమార్, కామిరెడ్డి బోడకొండ తదితరులు నివాళులర్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ: తొలి విద్యామంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా ఉర్దూలో రాణించిన వివిధ రంగాల ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్‌మస్తాన్ వలి ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ బాషా, సాహిత్యంలోని వివిధ రంగాల్లో రాణించిన వారికి మౌలానా అజాద్ పురస్కారాన్ని రూ.1.25 లక్షల నగదు ప్రోత్సాహాన్ని సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. అబ్దుల్ హక్ పురస్కారం కింద రూ.లక్ష ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులకు కూడా పురస్కారాలు అందిస్తామన్నారు. అలాగే జీవిత సాఫల్యపురస్కారం కోసం రాష్ట్రానికి చెందిన ఉర్దూ సాహితీవేత్తలు, పండితులు, కవులు, పాత్రికేయులు, విమర్శకులు పరిశోధన రంగాల్లో ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఉర్దూ అకాడమీ ద్వారా జారీ చేసిన దరఖాస్తులను పూరించి తమకు పంపించాలని సూచించారు.

తైక్వాండో పోటీలకు ఏర్పాట్లు పూర్తి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో జిల్లా క్రీడామైదానంలో ఆదివారం నిర్వహించనున్న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సబ్ జూనియర్స్, జూనియర్స్, క్యాడెట్, సీనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది హాజరవుతున్నారన్నారు. ఈ నెలాఖరున జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా జట్టును ఈ పోటీలలో ఎంపిక చేస్తామన్నారు. పోటీలు ఉదయం 9 గంటలకు డీఎస్ఏలో ప్రారంభమౌతాయన్నారు.

ఎమర్జెన్సీ చికిత్స అవసరం

- అచేతనులను, ప్రాణార్తులను ఆదుకోవడంలో విఫలం
- క్షణం ఆలస్యమైనా భారీ మూల్యం తప్పని పరిస్థితి
- జీజీహెచ్ అత్యవసర విభాగంలో లోపించిన సేవలు
- అందుబాటులో ఉండని స్ట్రెచర్లు, వీల్‌చైర్లు, సిబ్బంది


సహాయకులు లేకపోవడంతో కాలు కుళ్లి అత్యవసర విభాగం ఆవరణలో నిస్సహాయ స్థితిలో వార్డులోకి తీసుకువెళ్లాలని అర్థిస్తున్న పర్లోవ పేటకు చెందిన మహిళ (ఫైల్)


జీజీహెచ్ అత్యవసర విభాగం

కాకినాడ క్రైం: నిరుపేదల సంజీవని జీజీహెచ్‌లోని అత్యవసర విభాగం అభాసుపాలవుతోంది. ప్రభుత్వం అన్ని వసతులు సమకూరుస్తున్నా వాటి వినియోగంలో అంతులేని నిర్లక్ష్యం బయటపడుతోంది. ఈ విభాగానికి వచ్చేవారు సహజంగానే కదలలేని, స్పృహలో లేని, అపస్మారక స్థితిలో ఉండేవారు వస్తారు. వారిని లోపలికి తీసుకువెళ్లేందుకు స్ట్రెచర్ కానీ, వీల్‌చైర్ కానీ ఇక్కడ అందుబాటులో ఉండవు. సిబ్బంది సరేసరి. ఎంఎన్‌ఓ ఏర్పాటు ఉండదు. దీంతో అత్యవసర వైద్యం సకాలంలో అందక రోగులు క్రమేణా ప్రాణాపాయానికి దగ్గరవుతూ ఉంటారు. రాత్రి వేళల్లో వచ్చే రోగుల పరిస్థితి మరింత దయనీయం. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అంతంత మాత్రమే ఉంటున్నారన్న విమర్శలూ ఎక్కువే. నర్సులు ఉదయం వేళ ఎంఎల్‌సీ, నాన్ ఎంఎల్‌సీ, ఐసీయూ మొత్తం 28 పడకల్లో సేవలందించడానికి 9 మంది ఉంటే, రాత్రి వేళల్లో ఆరుగురికి మాత్రమే పరిమితమవుతున్నారు. అలాగే వైద్యులు మూడు షిఫ్టుల్లో 9 మంది చొప్పున మొత్తం 27 మంది పనిచేయాల్సి ఉంటుంది. అలాగే రాత్రి షిఫ్టుల్లో వైద్యులు తమ గదుల్లో విశ్రాంతి తీసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తడంతో పాటు, సూపరింటెండెంట్‌కు ఫిర్యాదులూ అందాయి.

ప్రభుత్వ సూచనలు ఇవీ...

ఈ పరిస్థితుల నేపథ్యంలో అప్పటి డీఎంఈ, ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ.వినోద్‌కుమార్ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. అత్యవసర విభాగం వద్ద రెండు స్ట్రెచర్లు, రెండు వీల్ చైర్లు, ఒక ఎంఎన్ఓ, ఒక ఎఫ్ఎన్ఓతో పాటు సీఏఎస్ హోదా ఉన్న వైద్యుడు ఉండేలా చూడాలని ఆసుపత్రి ఉన్నతాధికారికి ఉత్తర్వులిచ్చారు.

● కాకినాడ దుమ్ములపేటకు చెందిన ఒంటెద్దు శ్యామల అనే విద్యార్థిని చీమల మందు తిని ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను జీజీహెచ్‌కు తీసుకొచ్చిన ఆమె అమ్మమ్మ ఆరు బయట బాధిత బాలికను ఉంచి వీల్‌చైర్ కోసం పాట్లు పడింది. ఎవరూ రాకపోయే సరికి మరో ఇద్దరు మహిళల సాయంతో మనవరాలిని వార్డుకు మోసుకెళ్లింది.

● మహాలక్ష్మినగర్‌కు చెందిన 16 ఏళ్ల బాలుడు తండ్రి మందలించాడని ఆత్మహత్యకు యత్నించాడు. అత్యవసర స్థితిలో అంబులెన్సులో తరలించినా తండ్రే భుజాలపై మోసుకువెళ్లి వార్డులో చేర్చాడు. అయితే కొద్ది సేపటికే ఆ బాలుడు మృతి చెందాడు.

గోల్డెన్ అవర్ అత్యంత కీలకం



బాధితులు లేదా, రోగులకు గోల్డెన్ అవర్ అత్యంత కీలకం. విష ప్రయోగం, పాము లేదా విష కీటకాల కాట్లు, హృద్రోగులు, ప్రమాదాల బారిన పడే వారికి ఈ సమయం ఎంతో ముఖ్యం. ఆ సమయంతో తగిన వైద్యం అందితే రోగి మరణ ప్రమాదం నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుంది. ఆస్పత్రుల్లో ఈ గోల్డెన్ అవర్‌లో సరైన వైద్యం అందే విధంగా ఏర్పాట్లు జరగాలి. – డాక్టర్ కరీముల్లాహ్, మాజీ సీఎంఓ, జీజీహెచ్

తగిన చర్యలు తీసుకుంటాం



అత్యవసర విభాగం వద్ద అందించాల్సిన సేవలు పూర్తిస్థాయిలో సమర్థవంతంగా అందించగలుగుతున్నాం. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా జరుగుతున్న చర్యలను పరిశీలించాల్సి ఉంది. రోగుల ప్రయోజనం కోసం ప్రభుత్వ సూచనలు అమలయ్యేలా చూస్తాం. గత డీఎంఈ ఆదేశాల్లో పేర్కొన్న సిబ్బంది, పరికరాల ఏర్పాటుకు ఆదేశాలిస్తాం. – డాక్టర్ లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్

పంచాయతీలలో ఇకపై నగదు రహిత లావాదేవీలు


కార్యదర్శులకు క్యూఆర్ కోడ్, పోస్ మెషీన్లను అందజేస్తున్న ఏఓ, ఈఓ పీఆర్డీ

కరప: పంచాయతీలలో నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలని ఎంపీడీఓ కార్యాలయం ఏఓ గుత్తుల భీమశంకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కరప, ఉప్పలంక, గురజనాపల్లి గ్రామ పంచాయతీలకు మొదటిసారిగా వచ్చిన క్యూఆర్ కోడ్ పీఓఎస్(పోస్) మెషీన్లను ఆయా గ్రామకార్యదర్శులు ఎస్‌కే నాగేంద్రకుమార్, కె.కేశవరావు, వి.సునీల్‌కుమార్‌లకు ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావుతో కలసి అందజేసి, సూచనలిచ్చారు. ఇక నుంచి డిజిటల్ పేమెంట్స్ జరపాలన్నారు. ఈ మూడు పంచాయతీలకు ముందుగా అరట్లకట్ట యూనియన్ బ్యాంక్ ద్వారా క్యూఆర్ కోడ్‌లు, మిషన్లు వచ్చాయన్నారు. మిగిలిన గ్రామ పంచాయతీలన్నింటికీ కూడా వస్తాయన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా బోధించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం శనివారం తెలిపారు. కామర్స్, జువాలజీ, అక్వాకల్చర్, కంప్యూటర్ అప్లికేషన్, జర్నలిజం, మైక్రోబయాలజీ, గణితం, ఇంగ్లీష్, ఫిజిక్స్, హార్టికల్చర్, కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధించడానికి ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఈ నెల 9న కళాశాలకు హాజరుకావాలని సూచించారు.

కబ్జాలు, అక్రమ సంపాదన పైనే శ్రద్ధ

- అందుకే ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారు
- వనమాడిపై ద్వారంపూడి ఫైర్


కొండబాబు కబ్జాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ఎన్నుకున్న ప్రజలకు సేవ చేయాల్సింది పోయి నిత్యం భూ కబ్జాలు, అక్రమ సంపాదనపైనే టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దృష్టి పెట్టేవారని అందుకే ఆయనను 2019 ఎన్నికల్లో ప్రజలు తరమికొట్టారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిడిమిడి జ్ఞానంతో కొండబాబు తనపై చేస్తున్న విమర్శలపై ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. తన సొంత నిధులు వెచ్చించి ఎంఎస్ఎన్ చారిటీస్‌లో భూమిని చదును చేస్తుంటే ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారంటూ విమర్శించడంపై మండిపడ్డారు. చారిటీస్ అభివృద్ధికి రూ.50 లక్షలు ఇచ్చిన ఏకైక ఎమ్మెల్యే తానేనన్నారు.

భూ కబ్జాలపై ఇవిగో ఆధారాలు

వనమాడి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చారిటీస్ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారని, 2019 ఎన్నికలకు రెండు వారాల ముందు స్టేడియం నిర్మాణానికి హడావుడిగా శంకుస్థాపన చేసిన కొండబాబు అదే సర్వేనెంబర్‌లోని 2.8 ఎకరాల భూమిని తన తండ్రి వనమాడి లోవరాజుపేరిట పట్టా సృష్టించేందుకు ప్రయత్నిస్తే అప్పటి రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అడ్డుకున్నది నిజంకాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నాగమల్లితోట వద్ద పైడావారి భూములను, ఆకుల శ్రీరాములునాయుడుకు చెందిన భూముల కబ్జా యత్నాలను ప్రజలు మరువరన్నారు.

డ్రైఫిష్ వ్యాపారం చేసే కొండబాబు 2014 ఎన్నికలకు ముందు బ్యాంకు అప్పులు తీర్చకపోవడంతో జప్తు నోటీసు అందుకున్న స్థాయి నుంచి ఇప్పుడు కోట్లకు ఎలా పడగలెత్తారో చెప్పాలని నిలదీశారు.

వంతెన కుంగింది నీ వల్లే

ఎన్టీఆర్ వారధి కింద భాగంలో కొండబాబు స్వార్థంతో చేసిన డ్రెడ్జింగ్ పనుల వల్లే అక్కడ వంతెన కృంగిపోయిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కోటిన్నరతో పూర్తి కావలసిన వంతెనకు రూ.4.5 కోట్లు ఖర్చుపెట్టారంటూ వనమాడి విమర్శపై ఆయన స్పందిస్తూ చెన్నై ఐఐటీ ద్వారా సర్వే చేయించి పారదర్శకంగా పనులు చేశామని, అసలు ఆ బ్రిడ్జి కృంగిపోవడానికి కారణం నువ్వు కాదా? అని ప్రశ్నించారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి సొంత భూమి మీదుగా ఎలైన్‌మెంట్ మార్చి రూ.35 కోట్లు పరిహారంగా దిగమింగేందుకు చేసిన ప్రయత్నాన్ని అప్పట్లోనే అధికారులు అడ్డుకట్ట వేసిన విషయాన్ని గుర్తు చేశారు.

పావని తీరు హాస్యాస్పదం

సొంత పార్టీలోనే మనుగడలేక అవస్థలు పడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకర పావని తనపై చేస్తున్న వ్యాఖ్యలు చూస్తుంటే హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ద్వారంపూడిని విమర్శిస్తే పెద్దనాయకురాలిని అవుతాననే భ్రమలో ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు.

ఆమె మేయర్‌గా ఉన్నప్పుడు అవిశ్వాస తీర్మానం పెడితే పట్టుమని ఇద్దరు కార్పొరేటర్ల మద్దతు కూడా ఆమె సాధించలేకపోయారని, అటువంటి ఆమె తనను విమర్శించే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు.

మెరుగైన ఆరోగ్యం కోసమే 'సురక్ష'

- కమిషనర్ నాగనరసింహారావు


మహిళకు మందులు పంపిణీ చేస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు, మణికుమార్, బాబి


వైద్య శిబిరంలో మందుల కిట్లను అందజేస్తున్న నాయకులు, అధికారులు

కాకినాడ రూరల్: కాకినాడ గుడారిగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నాలుగు డివిజన్ల పరిధిలోని ప్రజలకు శనివారం వైద్యులు సేవలందించారు. స్థానిక మూడుగుళ్ల సెంటరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 2, 3, 4, 9 డివిజన్లకు చెందిన ప్రజలు శిబిరంలో వైద్య సేవలు అందుకున్నారు. కార్పొరేషన్ పరిధిలో 13 యూపీహెచ్‌సీల పరిధిలో జగనన్న సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మాజీ కార్పొరేటర్లు వడ్డి మణికుమార్, కంపర బాబి, పలకా సూర్యకుమారి, ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్, స్థానిక నాయకులు పాటి సూరిబాబు, గుత్తుల ప్రకాష్ తదితరులు వైద్య శిబిరంలో పాల్గొని, కమిషనర్‌తో కలసి మందులు పంపిణీ చేశారు.

సురక్షతో పేదలకు ఆరోగ్య భద్రత

కరప: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఆరోగ్య భద్రత కలుగుతుందని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. వేములవాడలో శనివారం సర్పంచ్ కమిడి మంగాదేవి అధ్యక్షతన సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సచివాలయం పరిధిలోని వేములవాడ, వలసపాకల గ్రామాల నుంచి 415 మంది వచ్చి తమ పేర్లను నమోదుచేయించుకున్నారు. వేళంగి, కరప పీహెచ్‌సీ వైద్యులు ఎంకే సౌజన్య, ఈ.సింధూర, పి.ఆశ వైద్యసిబ్బందితో కల్సి రోగులకు పరీక్షలు చేసి, మందులు రాసిచ్చారు. అనంతరం కేస్‌షీట్, మందుల కిట్లను పేషంట్లకు ఎంపీపీ అందజేశారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, కరప డీసీ మాజీ చైర్మన్ బండే తాతాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, కమిడి శంకర్, వజ్రపు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగాలి



విద్యార్థులకు బస్సు పాసులు అందజేస్తున్న సీపోర్టు ఉపాధ్యక్షుడు సత్యరాజేష్

బాలాజీచెరువు: ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగాలని కాకినాడ సీపోర్టు ఉపాధ్యక్షులు డి.సత్యరాజేష్ పేర్కొన్నారు. జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థులకు సీపోర్టు ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా బస్సు పాసులు పంపిణీ చేశారు. సామాజిక సేవలో భాగంగా ఈ పాస్‌లు అందజేశామని, పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సీపోర్టు డీజీఎం షేక్ ఖాసిం, పాఠశాల ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం ఏర్పాటు


కలెక్టర్ కృతికా శుక్లాను సత్కరిస్తున్న రాష్ట్ర శాలివాహన సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ పురుషోత్తం తదితరులు

కాకినాడ సిటీ: జిల్లాలో శాలివాహనులు (కుమ్మర్లు) ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర శాలివాహన సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ మండేపూడి పురుషోత్తం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను కలసి కోరారు. ఆ వర్గం సమస్యలను వారు కలెక్టర్‌కు వివరించారు. సంక్షేమ, అభివృద్ధి సంఘాల సభ్యుల నియామక పత్రాలను కలెక్టర్ ద్వారా సభ్యులకు అందించారు. సంఘ సభ్యులుగా అనకాపల్లి నూకరాజు, టిల్లపూడి నాగేశ్వరరావు, డి.రాంబాబు, టి.దొరబాబులు నియమితులు కాగా సంఘ పెద్దలు ఉబ్బిసెట్టి నారాయణరావు, కార్పొరేషన్ డైరెక్టర్ బిళ్లకుర్తి నాగమణి తదితరులు కలెక్టర్‌ను కలసిన వారిలో ఉన్నారు.

నర్సింగ్‌తో మానవతా దృక్పథం

- జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి

బాలాజీచెరువు: మానవతా దృక్పథం గల వృత్తి నర్సింగ్ జీజీహెచ్ సూపరిండెటెంట్ డాక్టర్ ఎస్.లావణ్య కుమారి పేర్కొన్నారు. ఆదిత్య అకాడమిలో శనివారం సాయంత్రం నర్సింగ్ విద్యార్థులకు కేపింగ్ సెర్మనీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై వైద్యులు శస్త్ర చికిత్సలు చేస్తే వారికి సేవలు చేస్తూ ఊరట కలిగించేవారు నర్సులన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరిండెంటెంట్ సంధ్యారాణి, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ అచ్యుతకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.5.3 కోట్లతో పారిశుధ్య కార్మికులకు క్వార్టర్లు

కాకినాడ: స్థానిక జగన్నాథపురం 23వ డివిజన్ రెల్లిపేటలో రూ.5.3 కోట్లతో నిర్మిస్తున్న పబ్లిక్ హెల్త్ వర్కర్స్ క్వార్టర్స్ నిర్మాణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు శనివారం పరిశీలించారు. శిథిలమైన పాత క్వార్టర్స్ స్థానంలో 42 మంది కార్మికుల కోసం జి ప్లస్ వన్ గృహాలు నిర్మిస్తున్నామన్నారు. సుమారు రెండు నెలల్లో నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని ఎస్ఈ పి.సత్యకుమారి కమిషనర్‌కు వివరించారు. అలాగే స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన పనులను సైతం ఆయన పరిశీలించారు. ఈఈ పి.వెంకట్రావు, ఇంజినీరింగ్ అధికారులు ఆయన వెంట ఉన్నారు.

నీటి మీటర్ల బకాయిలు వసూలు చేయండి

వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాల నీటి మీటర్ల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్, రెవెన్యూ, వాటర్‌వర్క్స్ విభాగాల అధికారులతో శనివారం ఆయన సమీక్షిస్తూ సుమారు రూ.4 కోట్లు వరకు బకాయిలు వసూలు చేయాలన్నారు. నెలాఖరులోపు బకాయిలు చెల్లించకపోతే కుళాయి కనెక్షన్లు కట్ చేస్తామని స్పష్టం చేశారు.

మీసాల వెంకన్నకు ప్రత్యేకపూజలు

కరప: మండలం యండమూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వంశపారంపర్య అర్చకులు పెద్దింటి సీతారామం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మీసాల వెంకటేశ్వరస్వామిగా పిలిచే స్వామివారిని దర్శించి, ఏడువారాలు, ఏడు ప్రదక్షిణలుచేసి మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని ఆయన తెలిపారు. శనివారం స్వామిని దర్శించుకోవడానికి పరిసర గ్రామాల నుంచి కాలినడకన వచ్చిన భక్తులు, భవానీలు స్వామివారిని దర్శించుకుని, పూజలుచేశారు. భక్తులు ఇచ్చిన విరాళాలతో కాలినడకన వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

వైభవంగా సీతారామస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న సీతారామస్వామి ఆలయంలో స్వామి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా శనివారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తకంగా కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బజాజ్ బైక్ రేస్


పల్సర్ బైక్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: బజాజ్ పల్సర్ వాహనం 2.0 ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం కాకినాడలో నిర్వహించిన బజాజ్ బైక్ రేస్ యువకులను ఆకట్టుకుంది. స్థానిక కల్పనాసెంటర్‌లోని సాయి మోటార్ ప్లాజా ఆధ్వర్యంలో గోపాల్ ఆటోమెటివ్ మైదానంలో నిర్వహించిన ప్రదర్శన స్థానికులను అలరించింది. అనంతరం పల్సర్ వాహనం 2.0ను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఎస్ఎంపీ బజాజ్ మేనేజింగ్ పార్టనర్ చక్కా వెంకటరమణ, బజాజ్ ఆటో రీజనల్ హెడ్ కరుణాకరణ్, శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వాహన వినియోగదారులకు కావాల్సిన మోడళ్లలో అందిస్తూ బజాజ్ ద్విచక్రవాహనాల సంస్థ అగ్రగామిగా నిలిచిందన్నారు. పల్సర్ ద్విచక్ర వాహన శక్తి సామార్థ్యాలు ప్రజలకు తెలియజేసేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సంక్షిప్తంగా..

ప్రతిభకు ప్రోత్సాహం

బోట్‌క్లబ్: ది సిటిజన్ కో– ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సేవలు మరువలేనివని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు అన్నారు. కాకినాడలోని ది సిటిజన్ కో ఆపరేటివ్ బ్రాంచ్‌లో శనివారం పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 95 శాతం మార్కులు సాధించిన షేర్‌హోల్డర్ పిల్లలకు ప్రోత్సాహకాలు అందించారు. సొసైటీ డైరెక్టర్ జె.సత్యనారాయణ మాట్లాడుతూ షేర్ హోల్డర్ పిల్లల్లో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సహకం కింద రూ.10 వేలు, సర్టిఫికేట్ ఇస్తున్నట్లు చెప్పారు. కాకినాడ బ్రాంచ్ పరిధిలో 8 మందికి ఈ ఏడాది ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ కీళ్ల వ్యాధి నిపుణులు పుల్లారావు, సొసైటీ మేనేజర్ కె.లోవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై దృష్టిపెట్టండి

అన్నవరం నుంచి గేట్‌వే పోర్టుకు వేయనున్న రైల్వే మార్గాన్ని కాకినాడ పోర్టుకు కలుపుతూ నిర్మించడం వల్ల నర్సాపురం వరకు రైలుమార్గం ఏర్పడుతుందని, అక్కడి నుంచి మచిలీపట్నం, రేపల్లె, నిజాంపట్నాలను కలుపుతూ బాపట్ల వరకు కోస్తా రైలు మార్గం నిర్మాణాన్ని చేపట్టాలని జెడ్ఆర్‌యుసీసీ సభ్యులు వైడీ రామారావు చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం జరిగిన 75వ జెడ్ఆర్‌యూసీసీ సమావేశంలో ఆయన ఈ అంశాలను ప్రస్తావించారు. కొవ్వూరు–భద్రాచలం రోడ్ రైల్వే లైన్ నిర్మాణానికి కొవ్వూరు నుంచి సత్తుపల్లికి కలుపుతూ వెంటనే రైలు మార్గం నిర్మించాలని రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. గతంలో ఉండే రైల్వే రాయితీలను కూడా పొడిగించాలని కోరారు.

ఆశ వర్కర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

కాకినాడ సిటీ: గుంటూరు జిల్లాలో మరణించిన ఆశ వర్కర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని, ఆమె కుటుంబానికి రూ. 50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని శనివారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ, ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగం ఇవ్వాలని, ఇంటి స్థలం, ఇల్లు నిర్మించి ఇవ్వాలని, మరణానికి కారణమైన వైద్యాధికారి, హెల్త్ విజిటర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు బేబీరాణి, చెక్కల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

కాకినాడ సిటీ: ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్, దళిత గిరిజన బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు డోకుబుర్ర భద్రం పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అంబేద్కర్ భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్లు నమోదుపై మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకులు రవి, లలితాదేవి, ఆకుమర్తి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

కాకినాడ క్రైం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో వందలాదిగా మద్యం సీసాలు పట్టుబడ్డాయి. శనివారం కాకినాడ గ్రామీణ మండలం పగడాలపేట వై జంక్షన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒక కారును కాకినాడ సౌత్ సెబ్ స్టేషన్ బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో కారులో అక్రమంగా తరలిస్తోన్న 372 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బోడపాటి బాబ్జీ, మాచా వీరబాబు, వాడబోయిన సాంబశివలను అరెస్టు చేశారు.

ఇద్దరు జూదరుల అరెస్ట్

కరప: గొర్రిపూడి సమీపంలో పేకాడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని, రూ 4,570 స్వాధీనం చేసుకున్నారు. కరప పోలీసుస్టేషన్ రైటర్ శ్రీనివాస్ తెలిపిన కథనం మేరకు గొర్రిపూడి సమీపంలోని కృష్ణబాబుపుంతలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో ఎస్ఐ ఎన్.రామకృష్ణ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఘటనా స్థలంలో ఇద్దరు నిందితులను అరెస్ట్‌చేసి, వారి నుంచి నగదు, 104 పేకలు స్వాధీనం చేసుకున్నారు. కొందరు పరారు కాగా, అక్కడ ఉన్న ఆరు మోటార్ సైకిళ్లను సీజ్‌చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిందితులను, మోటార్‌సైకిళ్లను, నగదు, పేకలను కాకినాడ కోర్టుకు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.